

81
ధారావాహిక

**జరిగిన కథ :**

పినచోడుని మరణవార్తతో.. హుటాహుటిన దనదప్రోలుకు ప్రయాణమయ్యాడు జాయపుడు. తండ్రిశ్రాద్ధకర్మలన్నీ జరిపించాడు. అనుమకొండ వెళ్లాక నీలాంబ నివాసానికి వెళ్లాడు. సగం శరీరం కాలి.. జీవచ్ఛవంలా తల్పానికే పరిమితమైన నీలాంబను చూసి కన్నీళ్లు పెట్టుకున్నాడు. జాయపుణ్ని చూసి ఆమెకూడా మౌనంగా రోదించింది. నీలాంబ కాలిన కట్టెలా మంచాన మిగిలితే.. లలిత నిలువనీడ కోల్పోయిన మొక్కలా మిగిలింది.

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

నీలాంబ వేశ్యావాటిక పూర్వ వైభవానికి గణపతిదేవుడు, జాయపుడు పూర్తి సహ యసహకారాలు అందించారు. కానీ, నీలాంబ – లలితాంబలలో పూర్వపు ఉత్సాహసరదాలు తేలేకపోయారు.

ఇప్పుడు జాయపుణ్ని చూసినప్పుడు అతను కూడా.. అచ్చం లలితాంబలాగే ఏదో కోల్పోయినట్లు.. ఎవరో అతని శక్తియుక్తులను బలవంతంగా లాక్కున్నట్లు తోచింది నీలాంబకు. ఆశ్చర్యంతో జాయపుని బుగ్గలు నిమురుతూ అడిగింది.

''జాయా.. తమ్ముడా! ఏమైంది!? ఏదో కోల్పోయి నట్లు.. కళావిహీనమై దీనంగా.. ఏమైంది నాయనా?''..

కరుణతో, ప్రేమతో ఆమె అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియలేదు అతనికి.

అప్పుడే లలితాంబ లోపలికి వచ్చింది. అక్కా తమ్ముళ్లను చూసుకుంటూ.. జాయపుణ్ని పలకరించకుం డానే, వడివడిగా మెట్లెక్కి పైకి వెళ్లిపోయింది.

''నా శరీరం మంటల్లో కాలిపోయింది. కానీ, లలిత జీవితం.. మనసు మరింతగా కాలిపోయాయి జాయా!''.

ఆమె కన్నీరు కళ్ల పక్కగా ప్రవహిస్తూ దిండులో ఇంకిపోతున్నాయి.

''కాస్త దానిని ఓదార్చు జాయా.. నువ్వంటే దానికి ఎంత.. ఎంతో..''

మాట పూర్తిచేయలేక పోయింది నీలాంబ. అర్థం చేసుకున్నట్లు తల పంకించాడు జాయపుడు.

'లలితను నేను ఓదారుస్తాను. మరి నన్ను ఓదార్చే వారెవ్వరూ!?' అనుకున్నాడు. అనలేదు.

మెట్లెక్కి పైకి వెళ్లాడు. వసారా అంచున నిలబడి దూరంగా చూస్తున్నది. ఆమె ముఖంలో దారుణ అనుభ వాల ప్రతిధ్వనులు జాయపునికి తెలుస్తున్నాయి.

'నాముఖం కూడా అలాగే ఉన్నదేమో..' అనుకున్నాడు.

''అక్క చాలా దిగులు పెట్టుకున్నట్లుంది లలితా..'' అన్నాడు జనాంతికంగా.

''అవునా!??.. అవును మరి. మమ్మల్ని ప్రేమించే వాళ్లెవ్వరు జాయ మామా!? కనీసం కామించే వాళ్లు కూడా లేకుంటే..'' ఆమె కంఠం వణికింది.

లలిత మాటల్లో తనను కూడా పట్టి ప్రశ్నిస్తున్నది. తనకు లలితపై యవ్వనోల్బణ శృంగార మేఘాలు కమ్ము కున్నాయి నిజమే. కానీ, అవెందుకో ప్రకీర్ణమై వర్షించ లేదు. కారణం.. కాకతి కావచ్చు.

లలితాంబ తన చుట్టూ ఓ అనురాగ మందిరాన్ని నిర్మించుకున్నదేమో.. అందుకే తనను చూసినప్పుడు ఆమెలో అంత నిర్వేదం. తను కాకతితో అనుమకొం డలో తిరుగాడటం ఆమె స్వయంగా చూశానని చెప్పింది.

ఆమె దగ్గరగా వెళ్లాడు. తనలో సంఘర్షిస్తున్న భావ నలు లలితతోనైనా సమీక్షించుకోవాలని అనిపించింది.

''నా యవ్వనారంభంలో ముగ్గురు అమ్మాయిలు నాకు దగ్గరగా వచ్చారు. ఓ పల్లె యువతి కాకతి.. ఓ రాజకుమారి ఇంద్రాణి.. ఓ మహిళా సంరక్షణ యోధు రాలు లలితాంబ. వీళ్లు ముగ్గురూ నాకు దగ్గరగా.. చాలా దగ్గరగా వచ్చారు. ఎవ్వరిని జీవితభాగస్వామిగా నిర్ణ యించుకోవాలో తేల్చుకోలేకపోయాను. ఎందుకు? నాలో ప్రేమ రాహిత్యముందా.. నేను ఎవరినీ మనసుకు తీసుకోలేకపోతున్నానా!? అని సతమతమైపోతున్న సమయంలో కాకతి మరింత దగ్గరై.. శారీరకంగా..'' పూర్తిచేయలేక పోయాడు.

కొన్నిలిప్తల కాలం నిశ్శబ్దం. ఆమెకు అర్థం కావాలని.. ఆమెకు చెప్పుకోవాలని జాయపుని ఆర్తి..

అర్థం చేసుకున్న లలిత అసహనంగా కదిలి దీర్ఘంగా నిట్టూర్పు వదిలింది.

''కానీ అప్పుడే జరగరానిది జరిగింది..'' అంటూ భైరవ ఆత్మాహుతి అంశం చెప్పాడు.

''అప్పట్నుంచి కాకతి అదృశ్యమైంది. నేనేమిటి.. నా బతుకు ఏమిటి.. ఏం చెయ్యాలి ఇప్పుడు.. బతు కింతా??''..

పూర్తి చేయలేకపోయాడు. కొన్ని లిప్తలకాలం నిశ్శబ్దం. దిగ్భ్రమతో కదిలింది లలిత. దగ్గరగా వచ్చి అతని కళ్లలో కళ్లుపెట్టి చూసింది చకితంగా. అతనిపై పేరుకున్న కోపం, అసహ్యం.. కరిగి పూర్తిగా ప్రక్షాళనమైనట్లు అనున యంగా దగ్గరగా వచ్చింది. అతని భుజాలను పట్టు కుంది. మరింత దగ్గరగా వెళ్లి చేతులు వెనక్కిదించి.. లాక్కున్నట్లు గాఢంగా హత్తుకుంది. గాఢ పరిష్వంగం!